క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న పాలకవర్గ సభ్యులు, భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులతోపాటు ఇటీవల నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గ సభ్యులు, చైర్మన్ అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో చైర్మన్ కడలి మాణిక్యాలరావు, సభ్యులు తిరుమాని పెద్దిరాజు, బొక్క వెంకట్రావు, దాసరి శివాజీ తదితరులున్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

మొగల్తూరు: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, మానసిక ఉత్తేజం కలుగుతాయని జిల్లా స్పిరిచ్యువల్ సొసైటీస్ అధ్యక్షుడు రుద్దిరాజు పెద్దివర్మ తెలిపారు. ఆదివారం కేపీ పాలెం తీరంలోని పాండు రంగ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సామూహిక ధ్యాన మహా యజ్ఞ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి ఒడిలో, సాగర నదీ పరివాహక ప్రాంతాలలో సామూహిక ధ్యానం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలైన యువతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ సభ్యులు కేవీడీ ప్రసాద్, బలరామ్ కుమార్, తటవర్తి రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు మండల బీసీ సెల్ అధ్యక్షుడుగా వెంకటేశ్వరరావు



నున్నబోయిన వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్తి పాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నున్నబోయిన వెంకటేశ్వరరావును పాలకొల్లు మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడుగా నియమించారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేసినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదివారం విలేకరులకు తెలిపారు.

వైభవంగా పునఃప్రతిష్ఠ మహోత్సవాలు



పెనుగొండలో సామూహిక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: స్థానిక లింగాల వీధిలోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు సందర్భంగా ఆదివారం సామూహికి పూజలు నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠంచనున్న విగ్రహాలకు, ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ కేతవరపు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉండి: మండలంలోని చెరుకువాడ శివారులో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెరుకువాడ శివారు ఉండి కాలువలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం కనిపించడంతో స్థానిక వీఆర్వో వెంకటదుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కాలువ నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే మృతదేహం గుర్తు పట్టేందుకు కొంత ఇబ్బందిగా ఉందని మృతదేహంపై నల్లచారలు, పూలతో ఉన్న చొక్కా, నల్ల ఫ్యాంటు ధరించినట్లు తెలిపారు. మృతునికి 35 నుండి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులు తెలియజేయాలని కోరారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదులో టాప్

- ఈ-క్రాప్ నమోదుతో మెండుగా ప్రయోజనాలు
- అధికారులు అవగాహన కల్పించడంతో ముందుకొచ్చిన రైతులు



యలమంచిలిలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి

యలమంచిలి: రైతులకు ఈ-క్రాప్ నమోదుకు ముందుకు వస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారు. విత్తనాల ఎంపిక నుంచి పండించిన పంట మార్కెట్‌కు తరలించే వరకు అన్నదాతలకు అవసరమైన అన్ని రకాల సేవలు, సహాయం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు ఏర్పడిన సమయంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ-క్రాప్‌నమోదు విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానంలో రైతులు ఏ విధమైన పంట, ఎంత విస్తీర్ణంలో పండించారో? స్పష్టంగా నమోదు చేస్తారు. గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించి ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు.

పంట నమోదులో మరింత పారదర్శకత

ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదులో మరింత పారదర్శకత తీసుకొచ్చింది. పంట నమోదు యాప్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చారు. ఈ విధానంలో రైతులు తాము సాగు చేసే భూమిలో ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. ఊడ్పులు పూర్తవ్వగానే ఆధార్, పంట రకం, విత్తిన తేదీ వివరాలను కొత్త యాప్‌లో నమోదు చేస్తారు. అనంతరం యాప్‌లో నమోదు చేసిన ప్రతి సర్వే నెంబర్ దగ్గరకు వెళ్లి జియో కార్డినేట్స్ ద్వారా ఫొటో తీస్తారు. పంట నమోదు సక్రమంగా చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే సబ్సిడీలు అందుతాయి.

రైతులకు అందే ప్రయోజనాలు

రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయించుకోవడం వల్ల పంటల భీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా, వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్లు మంజూరు వంటి ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ-క్రాప్‌లో భాగంగా రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతి రైతు భూమి, గ్రామం, సర్వే నెంబరు, ఆధార్, పంట వివరం, నాట్లు వేసిన తేదీ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు. దీంతో పంట అమ్మే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరమవుతుంది.

ఉచితంగా ప్రీమియం..

ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి పంట దెబ్బతింటే పరిహారం రావాలంటే రైతులు ఇన్సూరెన్స్ చెల్లించాలి. కానీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తూ రైతులపై ఆ భారం లేకుండా చేసింది. ఇన్ని ప్రయోజనాలు కలిగిస్తున్న ఈ-క్రాప్ నమోదు గతంతో పోలిస్తే ఈ సారి చాలా ఎక్కువైంది. రైతులు ఈ-క్రాప్ నమోదు వల్ల ప్రయోజనాలు కలుగుతున్నాయని నమ్మడంతోనే నమోదు వేగవంతమైందని అధికారులు చెబుతున్నారు.

ఈ-క్రాప్ నమోదు ఇలా

మండలం	రైతులు	నమోదైన ఎకరాలు
ఆచంట	5651	10108
నరసాపురం	4945	9384
పాలకొల్లు	5993	9672
పెనుగొండ	5363	11964
పెనుమంట్ర	6632	12250
మొగల్తూరు	796	1189
యలమంచిలి	3524	5566
పోడూరు	6591	13308

వేగంగా పంట నమోదు..



రైతులకు ఎంతో మేలు చేసే ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని వేగంగా చేస్తున్నాం. ఈ-క్రాప్ నమోదు చేయడానికి గ్రామ వ్యవసాయ సహాయకులు పంట పొలం వద్దకు వెళ్లి భూమి సర్వే నెంబరు, ఏ పంట సాగు చేశారు, ఎంత విస్తీర్ణం, ఏ తేదీన సాగు చేశారు తదితర వివరాలన్నీ యాప్‌లో నమోదు చేశారు. విత్తు నుంచి విక్రయం వరకు మేలు చేసే ఈ-పంట నమోదును రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.

– శింగులూరి దేవి, మండల వ్యవసాయాధికారి

ఈ-పంట నమోదుతో రైతులకు ప్రయోజనం



ఈ-పంట నమోదు కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు అందుతుంది. ప్రకృతి విపత్తుల వల్ల పంట దెబ్బతిన్నా రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా నష్ట పరిహారం బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతుంది. కౌలు రైతులకు ఈ-క్రాప్ నమోదు ఎంతో ప్రయోజనకరం.

– బొంతు వెంకట కర్దారెడ్డి, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్

రోగ పీడితులకు వసుధ సహాయం



రోగ పీడితులకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చెక్కులు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ తరపున చైర్మన్ మంతెన వెంకట్రామరాజు గత రెండు దశాబ్దాలుగా విద్య, వైద్య, సామాజిక రంగాలకు విలువైన సేవలందించడం అభినందనీయమని డా.వైఎస్సార్ కిడ్నీ సెంటర్ (పలాస) ప్రొఫెసర్ డా.కేఎస్ సందీప్‌వర్మ, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు (జాయింట్ రీప్లేస్‌మెంట్, వైజాగ్) ఇందుకూరి సతీష్‌రాజు అన్నారు. పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో ఆదివారం పలువురు రోగులకు ఆర్థిక సహాయం చెక్కులను వీరి చేతుల మీదుగా అందజేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పోడూరు మండలం జిన్నూరుపాలెం గ్రామానికి చెందిన సాయికృష్ణకు రూ.20వేలు చెక్కును, పక్షవాతంతో బాధపడుతున్న అల్లూరి సూర్యవతికి రూ.10వేలు, యలమంచిలి మండలం మేడపాడు గ్రామానికి చెందిన యాతం గీతా సుమంగళికి రూ.10వేలు, నరసాపురం మండలం మర్రితిప్ప గ్రామానికి చెందిన ఎస్ సత్యవతికి రూ.10 వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గుండె వైద్య శిబిరం



రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గుండె వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పట్టణంలోని పీచుపాలెంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయవాడ హెల్ప్ ఆసుపత్రి నిపుణుల బృందంతోపాటు, పట్టణానికి చెందిన దంత వైద్యుడు రవిరాజు తదితరులు రోగులకు సేవలందించారు. నరసాపురం రోటరీక్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని పట్టణ ప్రముఖుడు బాపూశ్రీ ప్రారంభించారు. శిబిరంలో గుండెకు సంబంధించి ఏకో, ఈసీజీ, యాంజోగ్రా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మేజర్ డోనర్ కోట్ల రామకుమార్, అసిస్టెంట్ గవర్నర్ తోట శ్రీనివాసబాబు తదితరులు మాట్లాడుతూ గుండె జబ్బులు ప్రమాదకరమైనవే అయినా ప్రస్తుతం వాటికి మంచి వైద్యం అందుబాటులోకి వచ్చిందని, సరైన సమయంలో గుండె జబ్బులను గుర్తించి వైద్యం చేయించుకుంటే ప్రాణాపాయ పరిస్థితి నుంచి సునాయాసంగా బయట పడవచ్చునన్నారు. సుమారు 300 మందికి పైగా ఈ శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గత ఏడాది నవంబరులో నిర్వహించిన శిబిరం ద్వారా గుండె సమస్యలను గుర్తించిన 14మందికి ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు చేయించామన్నారు. దంత వైద్య శిబిరానికి వచ్చిన 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ బొమ్మిడి సూర్యకుమారి, కార్యదర్శి అనసూయ, రొటేరియన్లు సీహెచ్ మురళీధర్, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ అమలు చేశాం



విప్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు చెబుతున్న గుబ్బల శ్రీనివాస్

భీమవరం: గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం నియోజకవర్గ పరిశీలకుడుగా నియమితులైన ఆకివీడుకు చెందిన మోటుపల్లి గంగాధర్‌రావు ఆదివారం రాత్రి స్థానిక క్యాంప్ కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రాజకీయాల్లో విశ్వసనీయతను తిరిగి నెలకొల్పిన ముఖ్యమంత్రి జగన్ ఒక పక్క అభివృద్ధితో, మరో పక్క సంక్షేమంతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఆకివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పుప్పాల పండు, ఇల్లా రాదా, వేగిరాము, విజ్జురోతి విజయకుమార్, వాడపల్లి జగన్ ,కొటికలపూడి ప్రసాద్, అంబటి రమేష్ ,మారా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

వైఎస్సార్ సీపీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతుందని ప్రభుత్వ విప్ శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ వీరవాసరం మండలం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గుబ్బల శ్రీనివాస్ ఆదివారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశారని అన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. రాబోయే ఎన్నికలలో సైనికుల్లా పనిచేసి పార్టీని అత్యధిక మెజార్టీ సీట్లతో అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీరవల్లి రాధాకృష్ణ, చుండూరి ముసలయ్య, గుడాల అయ్యవార్లు, రేవు నాగరాజు, వేంద్ర నాగరాజు, కట్టా తిరుపతిరావు, నాగేంద్ర పాల శ్రీను, బొక్కా నాగేశ్వరరావు, పాల కృష్ణ, బొక్క నాగేశ్వరరావు, పిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

280 మంది కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



రామచంద్రప్రభును సన్మానిస్తున్న కాపు సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఉపకారం పొందిన ప్రతీ విద్యార్థి రేపు దేశానికి ఉపయోగపడేలా క్రమశిక్షణ కలిగిన పౌరుడిగా ఎదగాలని కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ ప్రివిలేజ్డ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తులసీ రామచంద్రప్రభు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో పట్టణ శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం, కాపు వన సమారాధన కమిటీ, కోపా సహకారంతో ఏర్పాటుచేసిన కాపు, తెలగ, బలిజ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రప్రభు మాట్లాడుతూ తాను రూ.16 కోసం నలుగురు దాతలను అడిగానని ఒకరు పది రూపాయలు ఇవ్వడంతో మిగిలిన ఆరు రూపాయలు ఏదోలా సమకూర్చుకుని నేడు స్కాలర్‌షిప్‌లు ఇచ్చే స్థాయికి వచ్చానన్నారు. ఇప్పటికి తాను రాష్ట్రంలో 32 ప్రాంతాల్లో ఇలా సేవ చేస్తూ సుమారు రూ. 22 కోట్లు ఖర్చు చేశానన్నారు. ఏ ప్రాంతం వారైనా సరే మీరు ఎంత నగదు కలెక్ట్ చేస్తారో? అంత నగదు తాను ఇస్తానని చెప్పారు. పాలకొల్లు కాపు సంఘం నాయకులు రూ. 6 లక్షలు కలెక్ట్ చేయగా తాను రూ. 6 లక్షలు ఇచ్చి మొత్తం రూ. 12 లక్షల స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రూ. 3 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ. 3,500, పిజి విద్యార్థులకు రూ. 4 వేలు, ఇంజనీరింగ్ బీటెక్ విద్యార్థులకు రూ. 6 వేలు, మెడికల్ విద్యార్థులకు రూ. 7 వేలు చొప్పున మొత్తం 265 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. అనంతరం రామచంద్రప్రభు, కోపా నాయకులు ముచ్చర్ల సంజయ్, కొమ్ముల మురళీకృష్ణలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేగొండి హరిరామజోగయ్య, డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి, యడ్ల తాతాజీ, జెట్పీటీసి నడపన గోవింద రాజులు, అడబాల వెంకటరమణ, బోనం నర్సయ్య, వంగా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కాపుల కెపాసిటి 24 అనుకున్నారా?

జనసేన పార్టీకి 24 అసెంబ్లీ స్థానాలు ఇవ్వడంపై రామచంద్రప్రభు మాట్లాడుతూ ఈ సభలో రాజకీయాలు మాట్లాడకూడదు కాని జరిగిన పరిణామాలు బట్టి మాట్లాడాల్సి వస్తుందన్నారు. కాపుల కెపాసిటీని బట్టి 24 సీట్లిస్తే చాలని అవే ఎక్కువని డిసైడ్ అయ్యి ఇచ్చారనుకుంటున్నాను. కాపులను చాలా చులకన చేసి చూస్తున్నారని ఆవేదని వ్యక్తం చేశారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరిస్తామని నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి స్పందనను వినియోగించుకోవాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పోడూరు: పెనుమదం గ్రామంలో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యకర్తల మండలస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ పితాని చిన్నా ఆదివారం విలేకరులకు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గ సమన్వయకర్త గుడాల గోపి ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మార్టేరులో మానవతా సమావేశం




మార్టేరులో మానవతా సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం నెలవారీ సమావేశం ఆదివారం మార్టేరు మానవతా కార్యాలయంలో మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుబ్బల జయశంకర్ మాట్లాడుతూ కాలువలో కాలుష్యం పెరిగిపోతుందని, దీని ద్వారా భవిష్యత్‌లో క్యాన్సర్ రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. మరో ముఖ్య అతిథి ట్రైనీ డీఎస్పీ సతీమణి శ్వేత అరవింద్ మాట్లాడుతూ నేటి విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు కూడా పెంపొందించుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతిలో ఉన్న నీరు, గాలి పరోపకారం చేస్తూ మనిషికి మానవత్వాన్ని నేర్పాయన్నారు. ఎండూరి లక్ష్మీప్రసన్న ఎంసీఏ విద్యార్థికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేసారు. కార్యక్రమంలో జిల్లా మానవతా సెక్రటరీ కొత్త సత్యనారాయణమూర్తి, సెక్రటరీ బండి ప్రసాద్, కర్రి కృష్ణారెడ్డి, దొంగ దుర్గారావు, నరేంద్ర, వంశీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రప్రదర్శన



చిత్రాలు గీస్తున్న కళాకారులు



కళాకారుడు గీసిన చిత్రం

భీమవరం: స్థానిక మారుతి టాకీస్ సెంటర్లో ఉన్న అంకాల ఆర్ట్ అకాడమీ భవనంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన చిత్ర కళా సంబరం ఆర్టిస్ట్ వర్క్‌షాప్ సందర్శకులను ఆకట్టుకుంది. ఉభయ రాష్ట్రాల నుంచి 95 మంది చిత్రకారులు హాజరై లైవ్‌లో చిత్రాలను గీశారు. అకాడమీలోనే అప్పటికప్పుడు వేసి, తరువాత పోటీకి ప్రదర్శనకు ఉంచారు. ఇందులో భీమవరం ముఖచిత్రం, ఆక్వా రాజధాని, పంచారామ క్షేత్రం, కోడి పందేలు, ఎల్లాప్రగడ సుబ్బారావు, మావుళ్లమ్మవార్ని ఆరాధించటం, మగువ అందమైన చూపులు, కౌమార దశ బాలిక ఆహార్యం, పల్లెటూరి వాతావరణం, గోదావరి తీరం, పంచారామ క్షేత్రమహాశివుడి ఆహార్యం, ప్రకృతి తదితర చిత్రాల ప్రదర్శన ఆకట్టుకుంది. వర్క్ షాప్‌ను వదరాజు ముత్తరాజు ఆనంద్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని కళలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. కళలకు పుట్టినిల్లు పశ్చిమగోదావరి జిల్లా అని కళకారులు పేర్కొన్నారు. దాతల సహకారంతో భవనాన్ని నిర్మించారని, ప్రతి ఆదివారం ఉచితంగా చిన్నారులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ జేసీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, కాగిత వెంకటరమణ, గ్రంధి వెంకట్రావు, గోపా సత్యనారాయణ, అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి వెంకటరావు, కోశాధికారి గోపా సత్యనారాయణ, నల్లం వీరాస్వామి, డీవీఎస్ చంద్రజి, రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

వంతెన, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజలు



గుమ్ములూరులో వంతెన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: అభివృద్ధి పనుల కోసం కొబ్బరికాయ కొట్టిన నెల రోజుల్లోనే పనిని బట్టి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుని భూమి పూజ చేస్తున్నానని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోనూ, స్థానిక పట్టణంలోనూ ఆదివారం విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధులు మంజూరు చేసి, టెండర్లు పూర్తి చేసి, వర్కు ఆర్డర్ వచ్చిన తరువాత భూమి పూజ చేసి కొబ్బరికాయ కొడుతున్నాని చెప్పారు. నియోజకవర్గంలో గత 58 నెలల నుంచి తాను కొబ్బరికాయ కొట్టిన పని ఒక్కటీ ఆగలేదన్నారు. పకడ్బందీగా పనులు నిర్వహించడం వల్లే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, పక్కా డ్రెయిన్లు, వంతెనల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో చినకాపవరం డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి రూ. 60 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. దీనిలో రూ.25 లక్షలు రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు ఇచ్చారని నర్సింహరాజు తెలిపారు. గ్రామంలో జెడ్పీటీసీ, ఎంపీపీ నిధులు రూ. 16 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని 10వ వార్డులో రూ.3.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, 12వ వార్డులో రూ. 6.25 లక్షలతో సీసీ రోడ్లు, 15వ వార్డులో రూ. 4 లక్షలతో సీసీ డ్రెయిన్, 16వ వార్డులో రూ. 8 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, 18వ వార్డులో రూ. 7.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆయన వివరించారు. పట్టణంలో మొత్తం రూ. 29.42 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు నర్సింహరాజు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల కిషోర్ రెడ్డి, భీమవరం ఎన్నికల పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీ, నగర పంచాయతీ చైర్‌పర్సన్‌జామి హైమావతి పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నారు. ఈ మేరకు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 15 సంవత్సరం లోపు వయసు ఉన్న పిల్లలను పరిశీలించి,2ఈ ఎకో పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య చికిత్సలు అందిస్తారని పేర్కొన్నారు.